## క్లుప్తంగా

### 'గడప గడపకు' వంద రోజుల సంబరాలు

బద్వేలు అర్బన్ : నియోజకవర్గంలో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ క్ర్యాక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ నారాయణ, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి రవిలు మాట్లాడుతూ ఈ వందరోజుల్లో ఎన్నో ప్రజా సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, దళిత ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు, రేపు కృష్ణంపల్లెలో..

దువ్వూరు : మండలంలోని కృష్ణంపల్లెలో సోమ, మంగళవారాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటలకు, మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పాల్గొంటారని, అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని కోరారు.

### స్వర్ణామృత ప్రాశనం పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక బుశెట్టి కళ్యాణ మండపంలో ఆదివారం స్వర్ణామృత ప్రాశనం మందును ఉచితంగా పంపిణీ చేశారు. శ్రీ త్రిదండి చిన్న జియర్‌స్వామి వారి వికాస తరంగిణి ట్రస్ట్, బుశెట్టి శ్రీరాములు, ధనలక్షుమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 6 నెలల వయసు నుంచి 16 ఏళ్ల వయసు వారు దాదాపు 2 వేల మంది పిల్లలకు ఈ మందు పంపిణీ చేసినట్లు బుశెట్టి శ్రీరాములు, ధనలక్షుమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బుశెట్టి రాంమోహనరావు తెలిపారు. ప్రతినెల పుష్యమి నక్షత్రం నాడు ఈ మందు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ధనలక్షుమ్మ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



క్రీడా పోటీల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థినులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గౌతమి మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు ఇటీవల కడపలో నిర్వహించిన ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ 2023 పోటీల్లో ప్రతిభ కనపరచారు. వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్‌లో ప్రథమ బహుమతి, 800 మీటర్ల పరుగు, 4 ఇంటు100లో ద్వితీయ బహుమతి సాధించారు. వీరిని కళాశాల డైరెక్టర్లు నాగూర్, రవీంద్రారెడ్డి, కరస్పాండెంట్ బాబమ్మ, కో డైరెక్టర్ శైలూష, అకడమిక్ అడ్వైజర్ ఉమాకాంతం, ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు, పీడీ ఓబయ్య, అధ్యాపకులు, హెచ్‌ఓడీలు అభినందించారు.

### ముసల్‌రెడ్డిపల్లెలో వివేకానంద శోభాయాత్ర


ముసల్‌రెడ్డిపల్లెలో శోభాయాత్రలో పాల్గొన్న విద్యార్థులు

పోరుమామిళ్ల : స్వామి వివేకానంద వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ముసల్‌రెడ్డిపల్లెలో జనహిత కడప అంచల్ అధ్యక్షుడు తుపాకుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. విద్యార్థులు వివేకానంద, భరతమాత వేషధారణలతో శోభాయాత్రలో పాల్గొన్నారు.

# వరి.. సిరి

కుందూ నదీ పరీవాహక గ్రామాల్లో ముమ్మరంగా వరి పంట నూర్పిళ్లు జరుగుతున్నాయి. కొంత మంది రైతులు వరి ధాన్యాన్ని అక్కడే రోడ్లపై ఆరబోసి అమ్ముకుంటుండగా, మరికొందరు గోదాముల్లో నిల్వ చేసుకుంటున్నారు. గోదాముల్లో నిల్వ చేసుకుంటున్న రైతులు ధాన్యాన్ని రహదారులు, పొలాలు, కలాల్లో ఆరబెట్టుకుంటున్నారు. ఎకరాకు 30 నుంచి 37 బస్తాలు దిగుబడి అవుతున్నట్లు వారు తెలిపారు. ప్రస్తుతం బస్తా (78 కేజీలు) ధాన్యం రూ.1500 పలుకగా ఆరబెట్టిన ధాన్యం రూ.1750 పలుకుతున్నట్లు వ్యాపారులు తెలిపారు. ఈఏడాది వరి పంట సాగు చేసిన రైతులు దిగుబడి ఆశాజనకంగా రావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– రాజుపాళెం


వరి పంటను మిషన్‌తో నూర్పిళ్లు చేస్తున్న రైతులు


వరి ధాన్యాన్ని కలియతిప్పుతున్న రైతు


రహదారిలో ఆరబెట్టుకున్న దృశ్యం

## 12న హిందూ ఉపాధ్యాయ సమితి మహాసభలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు : గుంటూరులోని హిందూ కాలేజీ ఆఫ్ ఫార్మసీలో ఈనెల 12న హిందూ ఉపాధ్యాయ సమితి తృతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్, స్వామి వివేకానంద సేవా సమితి సభ్యులు మల్లికార్జునరావు, చలపతి, మోహన్ పేర్కొన్నారు. స్థానిక గీతాశ్రమంలోని విశ్వహిందూ పరిషత్, స్వామి వివేకానంద కార్యాలయంలో ఆదివారం ఆ మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన విలువలను కాపాడేందుకు హిందూ ఉపాధ్యాయ సమితి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రచయిత జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మన దేశ సంస్కృతి కాపాడేలా ఈ సమితి కృషి చేస్తోందన్నారు. హిందూ ఉపాధ్యాయ సమితి రాష్ట్ర కార్యదర్శి కుంటుమల్ల రామగోపాల్ మాట్లాడుతూ ఈ మహాసభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## నేటి నుంచి అన్నమయ్య సహస్ర గళార్చన

ప్రొద్దుటూరు : స్థానిక వైఎంఆర్ కాలనీలోని సాయిబాబా మందిరంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు రాచవీడు అన్నమయ్య కళాపీఠం ఆధ్వర్యంలో అన్నమయ్య సహస్ర గళార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు ఎర్రగొల్ల శ్రీనివాసయాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 వరకు ఈ కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9849053159కు సంప్రదించాలని కోరారు.

## ఆడపిల్లలు దేవుడిచ్చిన వరం



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : ఆడపిల్లలు జన్మించడం దేవుడిచ్చిన వరమని కల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి బద్వేలి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బుడ్డాయపల్లెలోని బీసీ బాలికల హాస్టల్‌లో ఆదివారం పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు చేయడం, చేయించుకోవడం నేరమని చెప్పారు. సమాజంలో స్త్రీ, పురుషులిద్దరూ సమానమేనని తెలిపారు. దీనిపై కుటుంబ సభ్యులకు, చుట్టు పక్కలనున్న సన్నిహితులకు అవగాహన కల్పించాలని బాలికలను కోరారు. సిర్డ్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ నేడు ఆడపిల్లలు మగవాళ్ల కంటే మిన్నగా అన్ని రంగాల్లో రాణిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సత్యవతి, సిర్డ్ సొసైటీ కార్యదర్శి ఒంటెద్దు చిన్నమ్మ, సభ్యులు చంద్రఓబుళరెడ్డి, నరసింహారెడ్డి, రమణమ్మ, సచివాలయ హెల్త్ సెక్రటరీ గృహలక్ష్మి, వసతి గృహ సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.

## సొంత డబ్బుతో పింఛన్ అందజేత

ప్రొద్దుటూరు : స్థానిక 25వ వార్డులో సాంకేతిక కారణాల వల్ల వితంతువు చానుకు పింఛన్ నిలిచిపోవంతో నూరి ఫౌండేషన్ ద్వారా ఈ నెల పింఛన్ రూ.2,750 అందించారు. ఈ సందర్భంగా నూరి ఫౌండేషన్ చైర్మన్ నూరి మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి స్ఫూర్తితో పింఛన్ నిలిచిపోయిన వితంతువు చానుకు ఆరు నెలల వరకు ప్రతి నెల రూ.2750 చొప్పున అందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఈనెల పింఛన్ అందించినట్లు చెప్పారు.

## ఎస్టీయూ నూతన భవనం ప్రారంభం

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలో ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంకు నూతనంగా నిర్మించిన భవనాన్ని ఆదివారం రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రారంభించారు. అనంతరం రీజనల్ కన్వీనర్ పుల్లయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. సభలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, తిమ్మన్న, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్, ఏపీ రాష్ట్ర మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జోసఫ్ సుధీర్‌బాబు, మల్లు రఘునాథరెడ్డి, ఉపాధ్యాయవాణి ఎడిటర్ నాగేశ్వరరావు, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, కాశినాయన మండల జడ్పీటీసీ సత్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, చెన్నకేశవరెడ్డి, పోరుమామిళ్ల, కాశినాయన, కలసపాడు, బి.కోడూరు మండలాల నాయకులు, ఉపాధ్యాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా జెండా మహోత్సవం


దస్తగిరిస్వామి దర్గా వద్ద సర్పంచ్ శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని కొత్తపల్లె గ్రామంలో దస్తగిరిస్వామి దర్గాలో ఆదివారం ఘనంగా దస్తగిరి స్వామి జెండా మహోత్సవం నిర్వహించారు. కులమతాలకు అతీతంగా భక్తులు దస్తగిరి స్వామికి కొబ్బరికాయలు, చక్కెర చదివింపులు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి హిందూ, ముస్లింలు సమైక్యంగా నిర్వహించుకునే ఉత్సవం జెండా పండుగ అని తెలిపారు. జెండా ఉత్సవాన్ని పక్కీర్ల మేళతాళాల మధ్య ఘనంగా ఊరేగించారు. కార్యక్రమంలో సీసీ హబ్ అధినేత బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## 'పెద్దిరెడ్డి' మృతి తీరని లోటు

ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ


నరసింహారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బి.కోడూరు : మేకవారిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పెద్దిరెడ్డి నరసింహారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు అన్నారు. ఆదివారం తెల్లవారుజాము గుండెపోటుకు గురై హఠాన్మరణం చెందిన పెద్దిరెడ్డి నరసింహారెడ్డి మృతదేహానికి నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వీరితో పాటు పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, బద్వేలు మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, బద్వేలు మార్కెట్‌యార్డు చైర్మన్ పుత్తాలక్ష్మిదేవి, సగర కార్పొరేషన్ చైర్మన్ గానుగపెంట రమణమ్మ, బద్వేలు మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, సివిల్‌సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, మాజీ పంచాయతీరాజ్ ఈఎన్‌సీ సుబ్బారెడ్డి, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రామకృష్ణారెడ్డి, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ రొండామాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, అట్లూరు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు మునిరెడ్డి, జయరామిరెడ్డి, జెడ్పీటీసీ దావీదు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు.

## పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

బద్వేలు అర్బన్ : సెలవుదినాల్లో తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి మీసాల రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల మానసిక ఉల్లాసాన్ని కాలరాస్తున్న ఆయా పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# పలు రోడ్ల పనులకు భూమిపూజ


తంబళ్ళగొంది రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

అట్లూరు : మండల పరిధిలోని పలు రోడ్లకు రూ.6.15 కోట్ల నిధులతో మంజూరైన తారురోడ్డు పనులకు ఆదివారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ భూమిపూజ చేశారు. అట్లూరు రోడ్డు నుంచి వరికుంట రోడ్డుకు రూ.1.60 కోట్లు, కడప–బద్వేలు ప్రధాన రహదారి నుంచి గుజ్జులవారిపల్లె రోడ్డుకు రూ.1.60 కోట్లు, కడప–బద్వేలు ప్రధాన రహదారి నుంచి తంబళ్ళగొంది రోడ్డుకు రూ.1.80 కోట్లు, కడప–బద్వేలు ప్రధాన రహదారి నుంచి బీబీసాహెబ్‌పేట రోడ్డుకు రూ.1.15 కోట్లు నిధులు మంజూరు కావడంతో ఆయా రోడ్లకు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ రొండా మాధవరెడ్డి, అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ రొండా మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, కుంభగిరి ఎంపీటీసీ గంగయ్య, సర్పంచ్ గంగమ్మ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పోతిరెడ్డి రెడ్డెయ్య, ఇరగంరెడ్డి భాస్కర్‌రెడ్డి, మల్లు సుబ్బారెడ్డి, గంగిరెడ్డి, అట్లూరు సుబ్బరాయుడు, వెంకట సుబ్బారెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ నాగరాజు, డీఈ అమర్‌నాథ్, ఏఈ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింల సంక్షేమానికి నిరంతర కృషి


హాజీ హబీబుల్లాను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని పేద, మధ్యతరగతి ముస్లింల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఖాజామొహిద్దీన్ తెలిపారు. స్థానిక జమ్మలమడుగు బైపాస్ రోడ్డులోని వాసవీ సర్కిల్ సమీపంలో ఉన్న ఖాజీ హబీబుల్లా సాహెబ్ మదరసా ఆవరణలో ఆదివారం సంఘం కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని రోజుల నుంచి పట్టణంలోని అన్ని వర్గాల్లో ఉన్న ముస్లింలను కలిసి 14 ఆశయాలు, ఉద్దేశాలతో సంఘ నిర్మాణం జరిగిందన్నారు. న్యాయవాదులు, డాక్టర్లు, ఇంజినీర్లు, వ్యాపార వేత్తలు, మేధావులు, ఇతరులను కలిశామన్నారు. 45 విభాగాలుగా విభజించి ప్రతి విభాగం నుంచి ఇద్దరు చొప్పున ప్రతినిధులను సంఘంలో ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తద్వారా ముస్లిం సమాజంలోని అన్ని వర్గాల నుంచి సహాయ సహకారాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎస్ ఫరీద్‌బాషా, కోశాధికారి జమాలుద్దీన్, న్యాయవాది షకీల్ అహ్మద్, వైద్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యం


వేదికపై అఖిలభారత యాదవ మహా సంఘం నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఐకమత్యంతోనే యాదవుల అభివృద్ధి సాధ్యమని అఖిలభారత యాదవ మహాసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి చల్లా రాజగోపాల్ యాదవ్ అన్నారు. స్థానిక ఆటోనగర్‌లోని ప్యారడైజ్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం అఖిలభారత యాదవ మహా సంఘం ప్రొద్దుటూరు నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు యాదవులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయే తప్ప.. సముచిత స్థానం కల్పించడం లేదన్నారు. రాష్ట్రంలో 36 లక్షల 90 వేల మంది యాదవ ఓటర్లు ఉన్నారని, అందరూ ఒకే తాటి పైకి వచ్చి రాజ్యాధికారం వైపుగా ముందుకు సాగాలన్నారు. అందరిలో రాజకీయ చైతన్యం వచ్చి ఏకమైతే సులభంగా రాజ్యాధికారం సాధించవన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు రమేష్ యాదవ్ మాట్లాడుతూ యాదవులంతా బీసీ, యాదవ అభ్యర్థులకే ఓటు వేయాలని కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మాధవరావు మాట్లాడుతూ రాయలసీమలో రెండు ఎమ్మెల్సీ స్థానాలు యాదవులు గెలిచే అవకాశం ఉందని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు ప్రాంతీయ పార్టీల మధ్య మనం నలిగి పోతున్నామని, రాజకీయ చైతన్యం వచ్చినప్పుడే అభివృద్ధి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో హరియాదవ్, వెంకటయ్యయాదవ్, రామయ్య, మధుయాదవ్, మునిరాంయాదవ్, ప్రకాశ్ యాదవ్, గిరి, రామ్మోహన్, దినేష్, సుబ్బయ్య, ప్రతాప్, రాష్ట్రంలోని పలు జిల్లాలు, పలు ప్రాంతాలకు చెందిన యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పాఠశాల స్టేజి ప్రారంభం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు మైసూరు దత్త పీఠాధిపతి శ్రీగణపతి సచ్చిదానందస్వామి.. రూ.15 లక్షలతో స్వామివారి భక్తులు ఏర్పాటు చేసి శాశ్వత స్టేజిని ప్రారంభించనున్నారు. స్వామి వారు ఇదే పాఠశాలలో చదువుకోవడంతో స్వామి వారు భక్తులు శాశ్వత స్టేజిని నిర్మించారు. ప్రారంభం అనంతరం స్వామి భక్తులనుద్దేశించి ప్రసంగించనున్నారు. అనుగ్రహ భాషణం, దివ్యనామ సంకీర్తన కోసం 4 వేల మంది భక్తులు కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. మైదానంలో ఫ్లడ్ లైటింగ్, కార్యక్రమం అనంతరం అన్నప్రసాదం పంపిణీకి 10 కౌంటర్లు ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో స్వామి శిష్యులు, భక్తులు పాల్గొననున్నారు.

### గణపతి సచ్చిదానంద స్వామి ఆశీర్వాదం

ప్రొద్దుటూరు : స్థానిక వైఎంఆర్ కాలనీలో శ్రీయోగిని వెంకమ్మ అత్త జ్ఞాపకార్థం నిర్మించిన శ్రీలక్ష్మీనరసింహ యూనివర్సల్ హాల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా శ్రీగణపతి సచ్చిదానంద స్వామి ఆదివారం వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి.. స్వామిని కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరు నాగేంద్రరెడ్డి, కాకర్ల నాగశేషారెడ్డి పాల్గొన్నారు.

## పరిమళించిన మానవత్వం


వృద్ధుడిని తరలిస్తున్న రామకృష్ణారెడ్డి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని రోడ్ల వెంబడి దుర్భర జీవితం గడుపుతున్న మహబూబ్‌బాషా అనే వృద్ధుడిని వివేకానంద సేవాశ్రమం వారు చేరదీసిన సంఘటన ఆదివారం జరిగింది. పట్టణంలోని రోడ్లమీద కొన్నేళ్ళుగా మహబూబ్‌బాషా సంచరిస్తూ జీవించేవారు. గాండ్లవీధి సచివాలయం శానిటరీ సెక్రటరీ నాగేంద్ర, వలంటీర్ హైమావతిలు అతన్ని గమనించి వివేకానంద సేవాశ్రమం వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డికి సమాచారం అందించడంతో వారు వృద్ధుడికి స్నానం చేయించి కాశినాయన మండలం ఓబుళాపురంలోని సేవాశ్రమానికి తీసుకెళ్ళారు.



## వ్యవసాయంతో అన్ని వర్గాలకు మేలు


ఆటో ద్వారా ప్రచారం చేస్తున్న అబ్దుల్ గఫార్

రాజుపాళెం : వ్యవసాయంతో అన్ని వర్గాల వారికి మేలు జరుగుతుందని నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన అబ్దుల్ గఫార్ అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు అందుబాటులో ఉండాలంటే వ్యవసాయం చేయాలని చెబుతూ ఆయన ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆటోలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పచ్చని పైర్లతో కళకళలాడాల్సిన పొలాలు ప్లాట్లుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్నంత మాత్రాన వ్యవసాయాన్ని వీడాలని ఎక్కడా లేదన్నారు. గతంలో తాను వర్షాభావం, రైతుల ఆత్మహత్యలపై, మహిళలపై దాడులు చేయవద్దని గ్రామాల్లో ఆటోద్వారా ప్రచారం చేసినట్లు వివరించారు.

## ఘనంగా బ్రాహ్మణ సేవాసంఘం వార్షికోత్సవం


లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాత రాఘవేంద్రస్వామి ఆలయంలో ఆదివారం బ్రాహ్మణ సేవా సంఘం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భగవద్గీత పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులను అందజేశారు. తిప్పాబొట్ల వెంకటసుబ్బావధానుల 30వ సంస్మరణ సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రాలయ వేదపాఠశాల గురువు లక్ష్మీనారాయణ శర్మను సత్కరించారు. బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు ఆర్‌జీ ప్రసాద్, కార్యదర్శి రంజన్‌శర్మ, బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఆక్యుప్రెజర్ శిబిరానికి విశేష స్పందన


ఆక్యుప్రెజర్ చికిత్స చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వెంకటేశ్వర్లపేటలోని సరస్వతీ విద్యామందిరంలో ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జోధ్‌పూర్‌కు చెందిన శ్రీ ఆక్యుప్రెజర్ రీసెర్చ్ అండ్ ట్రీట్‌మెంట్ సెంటర్ సహకారంతో ఉచిత ఆక్యుప్రెజర్ చికిత్సా శిబిరాన్ని నిర్వహించారు. దీనికి విశేష స్పందన లభించింది. మోకాళ్లనొప్పులు, కీళ్ల నొప్పులు, తలనొప్పి తదితర వ్యాధులకు సంబంధించి 200 మందికి సేవలందించారు. 6 రోజుల పాటు ఈ వైద్య శిబిరం నిర్వహించనున్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్‌పర్సన్ కళావతి, ప్రెసిడెంట్ సన్నుతి శ్రీనివాసులు, విద్యా కమిటీ చైర్మన్ రమేష్, వైస్ ప్రెసిడెంట్ డి.లక్ష్మన్న, డైరెక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.